



నరసరావుపేట: కాల్వలో పేరుకుపోయిన చెత్తా చెదారం

# మురుగు బురద

వానొస్తే.. వణుకే.. పట్టణాల్లో ఇదీ పరిస్థితి. వాన ఆ వెంట వచ్చే బురద.. ఆ తర్వాత రోడ్లపై పేరుకుపోయే బురదతో ప్రజలు అల్లాడుతుంటారు. మురుగుతో కలిసే బురదకు తోడు చెత్తాచెదారాలు పేరుకుపోయి దోమలు, దుర్వాసన తో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అసలే అంతంతమాత్రంగా ఉండే పారిశుధ్యం.. వర్షాలు పడిన ప్పుడు మరింత అధ్వానం గా మారుతుంది. మున్సిపల్ కేంద్రాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండ టంతో ఓ మోస్తరు వర్షాలకే రహదారులు తటాకాలను తలపిస్తుంటాయి. వర్షపు నీరు పోయేంత సామర్థ్యం లేకపోవడంతో వాన నీటితో కలిసిన మురుగు రోడ్లపైకి చేరుతుంది. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు గురించి తెలిసినా మున్సిపల్ పాలకులు, అధికారులు పరిష్కారాలపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గత ఐదేళ్లు వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లోని సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం పలు పట్టణప్రాంతాల్లో ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతు న్నారు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పాడు పెట్టడం, అవుట్‌ఫాల్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు వెచ్చించకపోవడంతో ప్రస్తుతం మున్సిపల్ ప్రజలకు శాపంగా మారింది.

- మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం
- మున్సిపల్ కేంద్రాల్లో అధ్వానపు డ్రెయిన్లు
- ఓ మోస్తరు వర్షానికే పొంగిపొర్లే కాల్వలు
- దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం.. వ్యాపిస్తున్న వ్యాధులు
- ఐదేళ్లు పట్టణాలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

## డ్రెయిన్లపై రూపాయి ఖర్చు లేదు..


ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్రెయినేజీలపై వైసీపీ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా ఖర్చుపెట్టలేదు. ప్రజలు ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోకుండా మున్సిపాలిటీ నిధులను సైతం పక్కదారి పట్టించింది. వాగు లు, కాలువల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని గతంలో పలుమార్లు ప్రజలు స్పందనలో ఇచ్చిన అర్జీలన్నీ బుట్టదాఖల య్యాయి. ప్రజల నుంచి ఆస్తి పన్నును ముక్కుపిండి వసూలు చేసే మున్సిపాలిటీ మౌలిక వసతులను కల్పించడంపై మాత్రం దృష్టిపెట్టలేదు. ఆస్తి పన్ను రూపేణా వచ్చే నిధులను దారి మళ్లించారు తప్పితే ప్రజల అవస్థలను పట్టించుకోలేదు.



నరసరావుపేటలో జమ్ముతో, వ్యర్థాలతో పూడి పోయిన ప్రధాన వరద నీటి కాలువలు

## అతిసార కేసులు నమోదు

పట్టణాల్లో అతిసారం కేసులు నమోదవు తున్నాయి. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. గుంటూరు, తెనాలి, పిడుగురాళ్ల పట్టణాల్లో అతిసార వ్యాప్తి చెందిన విషయం తెలిసిందే. పిడు గురాళ్లలో డయేరియా మరణాలు చోటు చేసుకున్నాయి. ఒక వైపు అతిసారం కేసులు నమోదు అవుతు న్నా పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించడంలేదు. వర్షం కురిస్తే పట్టణాలు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పురపాలకులు అప్రమత్తమై ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.



నరసరావుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి):అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వర్షాలతో మున్సిపల్ పట్టణాల్లో పారిశుధ్యం ఎంత అధ్వానంగా ఉందో బహిర్గతమైంది. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో ప్రధాన రహదారులు కూడా మురుగు, బురదతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక ఆయా జిల్లాల్లోని మున్సిపల్ పట్టణాల్లో వర్షాలు పడినప్పుడల్లా పారిశుధ్యం అధ్వానంగా మారుతుంది. దీంతో ప్రజలు వర్షాలు పడుతున్నాయంటే భయాందోళనలు వ్యక్తం చేస్తుంటారు. మురుగు, బురద, దోమలు, దుర్వాసనలు.. ఆపై రోగాలతో ప్రజలు అల్లాడిపోవాల్సిందే. అస్తవ్యస్త పారిశుధ్యంతో డయేరియాలాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వ్యర్థాలు రోడ్ల మీదకు వస్తున్నా యి. దీంతో పట్టణాలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలను ప్రధానంగా డ్రెయినేజి సమస్య పట్టిపీడిస్తున్నది. ఉన్న డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. తుంగ, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. దీనివల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. పారిశుధ్యం అధ్వానంగా మారి చినుకులు పడుతున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాలు, వాంతులు, విరోచనాల తో ఆస్పత్రులు బాట పట్టాల్సి వస్తోంది. వర్షాలు పడినప్పుడల్లా మీడియం, మైనర్ డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగు మేజర్ డ్రెయిన్ గుండా ప్రవహించకపోవడంతో అనేక చోట్ల మురుగు ఉబికి రోడ్లమీదకొస్తున్నది.

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పుర పాలక సంఘాలలో వరద, మురుగు నీటి కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో వర్షపు నీరు నిలిచి పోతున్నది. దోమల వ్యాప్తి ఉధృతం కానున్నది. అంటువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన సర్వత్రా నెల కొంది. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరించారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు పట్టణాల్లో ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నా పురపాలకులు అలస త్వాన్ని వీడటంలేదు. వర్షాల సమయంలో ముంపు బాధితులకు పరిహారం అందించే కన్నా ఇళ్ల ముంపునకు గురవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు.

దీనివల్లే ఏటా పేదలు పట్టణాల్లో వరద ముంపు కష్టాల ను ఎదుర్కొంటున్నారు. అధికారం అండతో కాల్వలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడంలేదు. కాల్వలు, డ్రెయిన్లు ఆక్రమణలతో కుచించుకుపోవడంతో వర్షాలు కురిస్తే నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వరద నీటి కాల్వలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిసినప్పుడల్లా పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు. వరద, మురుగు కాలుల్లో పూడిక తీత తక్షణావసరంగా ఉన్నా ఈ దిశగా పురపాలకులు స్పందించడంలేదు.

### ప్రత్యేక శ్రద్ధపెట్టాలి..

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధ్వానంగా మారిన మురుగునీటి పారుదల వ్యవస్థను తక్షణం సంస్కరించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీల్లో పూడికలు తీసి వరద నీరు నిల్వ లేకుండా చేయాలి. మురుగు కాలువల్లో పూడిక తీయాలని ఇటీవల మున్సిపల్ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించినా వారు మొద్దు నిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. ప్రతి మున్సిపాల్టీ లో వేసవిలోనే మురుగునీటి వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉంది. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బం దులు లేని విధంగా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవ్వ కుండా ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేప ట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపునకు గురయ్యాయో ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. పూడి పోయిన కాల్వలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి.



మాచర్ల: శ్రీనివాస థియేటర్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు

## ఐదేళ్లు పాడుపెట్టారు

మున్సిపాలిటీల్లో మురుగు, పారిశుధ్యం, డ్రెయినేజీల నిర్వహణపై ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కనీసంగా కూడా దృష్టిపెట్టిన పాపాన పోలేదు. పల్లపుప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతున్నా కన్నెత్తి చూడలేదు. గత ప్రభుత్వాలు ప్రారంభించిన వరద, మురుగునీటి కాల్వలను పాడుపెట్టారు. ప్రధాన కాల్వల్లో కనీసం పూడిక తీసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాల్వల్లో చెత్త పేరుకుపోయి వానలు కురిసినప్పుడు తీవ్ర దుర్గంధం వస్తున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా మున్సిపల్ అధికారులు, పాలకులు వ్యవహరించారు. దీంతో దోమలు, దుర్వాసన, అంటువ్యాధులతో ప్రజలు అల్లాడిపోవడం పరిపాటిగా మారింది. ఏ మున్సిపాలిటీలోనూ రూపాయి నిధులు లేకుండా ఊడ్చేసి ఖాళీ ఖజానాను వైసీపీ అప్పగించింది. బాపట్ల మున్సిపాలిటీనే దాదాపు రూ.11 కోట్ల లోటు బడ్జెట్‌తో ఉండడం మున్సిపాలిటీల దీనావస్థకు అద్దం పడుతోంది.



● నరసరావుపేటలో ప్రధాన రహదారిపై నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

## రోడ్లే కాల్వల్లా..

దాదాపుగా మూడు దశాబ్దాల క్రితమే నగరపాలక సంస్థ స్థాయికి ఎదిగిన గుంటూరులో నేటికీ ఓ మోస్తరు వర్షం కురిస్తే రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. ఏదైనా సమస్య వస్తే తప్ప మురుగు(పూడిక) తొలగించడం లేదు. నగరపాలక సంస్థ ఏటా మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టడం మినహా డ్రెయినేజీ వ్యవస్థని మెరుగుపరచలేకపోతున్నది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లే కాలువల్లా మారిపోయాయి. పీకలవాగులో కలిసే డ్రెయిన్లలో మురుగునీరు వెనక్కు తన్ని రోడ్లు పైకి వచ్చేస్తుంది. బ్రాడీపేట, అరండల్‌పేట మెయిన్ రోడ్డు, ఏసీ కళాశాల, మునిసిపల్ ఆఫీసు, పండ్ల మార్కెట్, ఏలూరు బజార్, లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, జీఎస్‌టీ రోడ్డు, నల్లచెరువు, ఆర్ అగ్రహారం తదితర మెయిన్ రోడ్లులో ఉన్న డ్రెయిన్లను మూసేశారు. దీంతో వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు చేరుతుంది.



●గుంటూరు ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు దుస్థితి

# రేషన్ లొసుగులు బహిర్గతం



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

- మంత్రి మనోహర్ తనిఖీల్లో వెలుగులోకి
- సరకుల పంపిణీ వాహనంలో కార్డుల గుట్టలపై ఆగ్రహం
- బియ్యం పంపిణీ కంటే నిల్వలే ఎక్కువపై నాదెండ్ల ఆశ్చర్యం
- వాహనాన్ని వదిలేసి పారిపోయిన ఓ ఎండీయూ ఆపరేటర్

తెనాలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీ వాహనంలోనే గుట్టలుగా కార్డులు.. పంపిణీ చేసిన వాటికంటే వాహనంలో ఉన్న బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.. విక్రయ కేంద్రంలోనూ అదనపు బియ్యం మూటలు, ఇతర సరుకులు.. ఇవన్నీ ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల్లో బహిర్గతమైన విషయాలు. వీటిని చూసిన మంత్రి విస్తుపోయి, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపిన మంత్రి ఆదివారం తన సొంత నియోజకవర్గంలోనూ రేషన్ పంపిణీ తీరును ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మంత్రి తనిఖీల సమాచారం తెలుసుకున్న తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ కూడా పాల్గొన్నారు. మొదట బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లో బియ్యం, కంది పప్పు దుకాణాన్ని పరిశీలించేందుకు మంత్రి వచ్చారు. అయితే ఒక దుకాణం మూసి ఉండటంతో ఆయన మండిపడ్డారు. పైగా సబ్‌కలెక్టర్ ప్రారంభించిన దుకాణం ఎలా ఉందనేది కూడా పరిశీలించరా అంటూ అధికారులపై మండిపడ్డారు. మరో దుకాణంలో నాణ్యమైన బియ్యంతోపాటే తక్కువ రకం బియ్యం ఉండటాన్ని చూసి ప్రశ్నించారు. వ్యాపారి పొంతనలేని సమాధానంతో రెండు దుకాణాలపై విచారణకు ఆదేశించారు. రెండో దుకాణాన్ని మాత్రం సీజ్ చెయ్యాలని ఆదేశించారు. ఆ తర్వాత పినపాడు దగ్గర రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని గమనించిన మంత్రి అక్కడ ఆగారు.

సరుకులు పంపిణీ చేసిన పరిమాణాన్ని పరిశీలించారు. దానిలో పాత కార్డులతోనే రేషన్ పంపిణీ చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిని పరిశీలించాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. మఠంబజార్‌లో రోడ్డుపక్కన ఎండీయూ వాహనం ఉండటం, తలుపులు తెరిచి ఉండటంతో దానిపై అనుమానం వచ్చి పరిశీలించారు. లోపల సంచిలో లబ్ధిదారుల కార్డులు గుట్టలుగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ జరపాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. తనిఖీల సమాచారం తెలిసి ఆపరేటర్ వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లి ఉంటాడన్న కోణంలో పరిశీలించాలని తెలిపారు. మరో వాహనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రైతుబజార్‌లో కూరగాయల ధరలను పరిశీలించారు. అయితే బయట మార్కెట్‌లో కిలో టమోటా రూ.40 ధర ఉంటే, రైతు బజార్‌లో రూ.52కు అమ్మడంపై దుకాణదారుడ్ని, సూపర్‌వైజర్‌ను మంత్రి ప్రశ్నించారు. రిజిష్టర్‌ను పరిశీలించి వ్యత్యాసం ఉండటంతో పనితీరు సరిగాలేదని సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశించారు.



వాహనంలో రేషన్ కార్డుల గుట్టలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్



కొత్తపల్లి జంక్షన్‌లో అనధికార లేఅవుట్

# వైసీపీ భూ మాఫియా

- మాచర్లలో అనధికార లేఅవుట్లు
- భూ బకాసురులకు మాజీ ప్రజాప్రతినిధి అండ
- అధికారం ఉందని అడ్డగోలుగా భూ ఆక్రమణలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం.. చెలరేగిన అక్రమార్కులు

మాచర్ల రూరల్, జూలై 14: గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మాచర్లలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయాయి. పాలకుల ఆశీస్సులు, అధికారుల అండతో వైసీపీ భూమాఫియా రెచ్చిపోయింది. ప్రభుత్వ భూములకు ప్రైవేటు భూములు జత చేసి అక్రమంగా లేఅవుట్లు వేసి అందిన కాడికి అమ్ముకొని రూ.కోట్లు కొల్లగొట్టారు. ఆశీస్సులు అందించిన అప్పటి ప్రజాప్రతినిధికి వాటాలు అందించి, అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి వైసీపీ భూమాఫియా కోట్లకు పడగలెత్తింది. గత వైసీపీ హయాంలో చోటామోటా నాయకులు విచ్చలవిడిగా దొరికిన చోటల్లా స్థలాలు ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. మాచర్ల పట్టణంలో ఐదేళ్లలో వేసిన ఏ లేఅవుట్‌కు కూడా అనుమతులు లేవు. ప్రభుత్వం అండ చూసుకుని భూమాఫియాకు తెగబడ్డారు. దీనిపై రెవెన్యూ, పురపాలకసంఘం, పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

### కొత్తపల్లి జంక్షన్లో..

మాచర్ల శివారులోని కొత్తపల్లి జంక్షన్లో సర్వే నంబరు 843లో 4 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఎకరంన్నర రైల్వే పోరంబోకు కాగా 50 సెంట్లు కుంట పోరంబోకు ఉంది. మిగతాది పట్టాభూమి. ఈ 4 ఎకరాల్లో ముగ్గురు వైసీపీ రౌడీషీటర్లు కలిసి అక్రమంగా లేఅవుట్ వేశారు. దుర్గి మండల వీఆర్వో, ఓ పోలీసు అధికారి వీరికి సహకరించారన్న ఆరోపణలున్నాయి. సదరు వీఆర్వో రెవెన్యూ కార్యాలయంలో అంతా తానై చక్రం తిప్పారని తెలిసింది. ఈ లేఅవుట్‌లో స్థలం కొన్న వారు కొందరు గృహ నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టారు. ముడుపులు ముట్టడంతో సంబంధిత శాఖల అధికారులు ఆ వైపు చూడడం లేదు.

### సొసైటీ కాలనీలో...

పట్టణంలోని సొసైటీ కాలనీలోని సాయిబాబా స్కూల్, స్విమ్మింగ్ పూల్ సమీపంలో సర్వే నంబరు 1240, 1241లో సుమారు ఆరు ఎకరాల్లో అక్రమ లేఅవుట్ వేసి విక్రయించేశారు. అలాగే సప్తగిరి టౌన్‌షిప్ సమీపంలో రెండు అక్రమ లేఅవుట్లు వేశారు. రాయవరం జంక్షన్‌లోని బైపాస్ సమీపంలోనూ రెండు లేఅవుట్లు వెలిశాయి. వినాయకుని గుట్టలో ఎస్ఆర్ ప్లాట్స్ పేరుతో 581బై8 సర్వేనంబరులో రెండు ఎకరాల్లో లేఅవుట్ వేశారు. రామప్ప దేవాలయం సమీపంలో నాలుగు ఎకరాల్లో అక్రమంగా లేఅవుట్లు వెలిశాయి. ఇవన్నీ వైసీపీ హయాంలో అనధికారికంగా వేసినవే. వీటికి సరైన అనుమతులు లేవు.



సొసైటీ కాలనీలో అనధికార లేఅవుట్

# దిక్సూచి DIKSUCHI

## కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

### కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాత బడిన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయిడ్ ఈజ్, జస్టిస్ డినైడ్' (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన
- 'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),
- 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),
- 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూత న చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

#### కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ



## భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023

జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

#### విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్దంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

# దిశలు - దూరాలు

## రీజనింగ్

**పార్ట్-2**

**ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం**

### ముఖ్యరేఖాచిత్రం


**1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?**

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:

R- బయలుదేరినస్థానం (ఇల్లు)
S- చేరుకొనినస్థానం (పాఠశాల)





పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

**2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?**

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:




I- మొదటి కారు
II- రెండవ కారు

పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

**3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?**

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:





పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

**4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?**

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




G- బయలుదేరిన స్థానం
H- చేరుకొనిన స్థానం


బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

**5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?**

ఎ) తూర్పు బి) పడమర సి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:





ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

**6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?**

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

**వివరణ:** నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.




ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

# మోదీ @ 10 కోట్లు

## 'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమార్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచనప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

## లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరో సారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్యం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్యం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

## మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మోంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.




## తెరుచుకున్న జగన్నాథుడి

# రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్కపెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్క పెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గది లోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

### రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

# సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

## పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి

తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రెటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.



నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు

## ఆక్వాపార్కుకు 192 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నాం

- నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు, మడ అడవుల పరిశీలన
- కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, జూలై 14: తీరప్రాంతంలో ఆక్వాసాగుకు అన్ని వసతులతో కూడిన 192 ఎకరాల్లో ఆక్వాపార్కు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి అన్నారు. ఆదివారం సూర్యలంక ఆదర్శనగర్ బ్రిడ్జి వద్దనుంచి నిజాంపట్నం హార్బర్ వరకు బకింగ్‌హాం కెనాల్‌లో 14 కిలోమీటర్ల మేర బోటులో కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు పర్యటించారు. నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను, సముద్రం ఒడ్డున మడ అడవులను, హార్బర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నంలో పర్యాటక, ఆక్వారంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వాపార్కుకు భూమిని ప్రభుత్వం కేటాయిస్తే పనులు మొదలుపెడతామని తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 2.5 హెక్టార్ల అటవీభూమిని భూసేకరణ చెయ్యాల్సి ఉందన్నారు.

బాపట్ల జిల్లాలో బీచ్‌ల వద్ద మరణాలు పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే సముద్రతీరప్రాంతాల్లో పర్యటించి అక్కడ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రకృతి విపత్తుల్లో తీర ప్రాంతానికి కంచుకోటగా మడ అడవులు నిలుస్తున్నాయన్నారు. కావున వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మడ అడవులను నరికివేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. జెట్టీల నిర్మాణం పెంపు కొరకు సముద్రంలో బోట్లు రాకపోకలు సాగించేలా మొగ వద్ద పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జర్ల ద్వారా పూర్తిగా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్లజిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్, బాపట్ల ఆర్డీవో ఆర్.రవీంద్ర, నిజాంపట్నం బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పశ్చిమ డెల్టాకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 14: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 264 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వ కు 123, పశ్చిమ కాల్వకు 83, నిజాంపట్నం కాల్వకు 187, కొమ్మమూరు కాల్వకు 1005 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### నేడు, రేపు ప్రజాదర్బార్ రద్దు

తాడేపల్లి, జూలై 14: వర్షాభావ పరిస్థితుల కారణంగా సోమ, మంగళవారాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. మళ్లీ ప్రజాదర్బార్ జరిగే తేదీని త్వరలో తెలియపరుస్తామని నారా లోకేశ్ కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.



# తెగని పంచాయితీ

- కొనసాగుతున్న గందరగోళం
- పలువురికి ఈ నెలలో ఆగిన వేతనాలు
- కార్యదర్శులకు దక్కని డీడీవో అధికారాలు
- తలనొప్పిగా క్లస్టర్ పంచాయతీల వ్యవహారం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ తాలూకా గందరగోళం ఇప్పట్లో తొలగేలా లేదు. గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు, పంచాయతీ బాధ్యతలు అప్పగించినా గత ప్రభుత్వ నిర్వాకంతో అవి వారికి ఎండమావిగానే మారిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ, వార్డు కార్యదర్శుల పేరిట వందల మందిని ఎంపిక చేసి నిర్దిష్టమైన జాబ్ చార్టు ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. దీంతో వారంతా తమకు పంచాయతీ విధులు కేటాయించాలని ఆందోళన చేపట్టడంతో గడిచిన రెండేళ్లలో మూడు సార్లు జీవోలు జారీ చేసింది. కానీ అమలు చేయలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి' విధానాన్ని, అందుకోసం తీసుకువచ్చిన జీవో 11ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలను తాజాగా అమలు చేసింది. గ్రేడ్- 5 కార్యదర్శులందరికీ గ్రామ పంచాయతీలను కేటాయించింది. కానీ గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళం కారణంగా వారిలో చాలా మందికి ఆ హోదా ఈరోజు వరకూ దక్కలేదు.

#### వెంటాడుతున్న క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య

కూటమి ప్రభుత్వం మూడు జిల్లాల్లో 500మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రామ పంచాయతీలు కేటాయించి, డీడీవో హోదా కల్పించింది. కానీ వారిలో చాలా మందికి క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య కారణంగా ఆ హోదా దక్కలేదు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన క్లస్టర్ విధానమే అందుకు కారణంగా తెలుస్తోంది. క్లస్టర్ విధానం కారణంగా 3, 4 మైనర్ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అందులో ప్రధాన పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో లాగిన్లలోకి మ్యాప్ చేశారు. ఆ కారణంగా ఒక మండలంలో 15 పంచాయతీలు ఉంటే, 7, 8 మంది మాత్రమే మ్యాప్ అయ్యారు. మిగిలినవారు ఎంపీడీవో క్యాడర్ పరిధిలోకి రాకుండా పోయారు. ఎంపీడీవో లాగిన్లో మ్యాప్ అయిన కార్యదర్శుల బిల్లులకు మాత్రమే ట్రెజరీ ఆమోదం లభిస్తుంది. ఆ కారణంగా క్లస్టర్ పంచాయతీల్లోని అనేక మంది పంచాయతీ కార్యదర్శులకు ట్రెజరీ శాఖ బిల్లులను ఆపేసింది. దీంతో వారికి ఈ నెల జీతాలు దక్కలేదు. కాగా కొన్ని జిల్లాలో 2, 3 నెలల నుంచి కూడా జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. దీంతో వారంతా పంచాయతీరాజ్ కమిషనర్‌కు గోడు విన్నవించుకున్నారు. ఆయన తక్షణమే స్పందించి ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు లేఖ పంపారు.

#### క్లస్టర్ గందరగోళం

గతంలో కార్యదర్శుల కొరత కారణంగా ప్రభుత్వం మూడు, నాలుగు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. వాస్తవానికి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉన్న 1200 పంచాయతీలకు 1236 మంది కార్యదర్శులు ఉన్నారు. కార్యదర్శుల కొరత లేని కారణంగా క్లస్టర్ వ్యవస్థని పూర్తిగా రద్దు చేయవచ్చు. క్లస్టర్ ప్రధాన కేంద్రంగా ఉన్న పంచాయతీలను కూడా గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5లకు కేటాయించవచ్చు. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు. గ్రేడ్ -2, 3, 4, 5 పంచాయతీల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు మెరిట్ ప్రాతిపదికన పంచాయతీలు కేటాయించి 'ఒక పంచాయతీకి- ఒక కార్యదర్శి' జీవో 11 పూర్తిస్థాయిలో అమలు చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు.

> **సమస్యను పరిష్కరించండి**
>
> గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. డీడీవో అధికారాలు అందరికీ వర్తింపజేయాలి. క్లస్టర్ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' జీవోను అమలు చేయాలి.
>
> - ముదువర్తి రమేశ్‌బాబు, కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## వైభవంగా శ్రీమహంకాళీ అమ్మవారి బోనాల జాతర



మహంకాళీ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఎస్.సవిత



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళా భక్తులు

దుగ్గిరాల, జూలై 14: మండలంలో ప్రసిద్ధిచెందిన కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో తెలుగు మహిళావిభాగం ఆధ్వర్యంలో బోనాల జాతర ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన సుమారు 200 మంది మహిళాభక్తులు అమ్మవారికి పొంగలి నైవేద్యం సిద్ధం చేశారు. మంగళగిరి రూరల్ మండలం టీడీపీ మహిళాధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మాలెంపాటి వెంకటేశ్వరరావుల సౌజన్యంతో బాలికలతో కలిసి తెలుగు మహిళానేతలు, కార్యకర్తలు ఉత్సాహం గా కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు మేళతాళాల మధ్య ఆల యం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని బో నాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైభవంగా జరిగిన బోనాల జాతర భక్తులకు కనువిందుచేసింది. టీడీపీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి రూరల్ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, మంచికలపూడి వైష్ణవి, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, ఎంపీటీసీలు పసుపులేటి సాయిచైతన్య, చిలువూరు మరియరోజమ్మ, తోటకూర సీతారామయ్య, పోలిమెట్ల రత్నగిరిరావు, డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు, గద్దె శ్రీనివాస్, ఆలపాటి శ్రీనివాసరావు, ఆలపాటి రామారావు, జానకీదేవి, నాయుడు సీతయ్య, చిలువూరు శేషగిరి, పినపాటి కరుణాకర్, పేరూరి సత్యనారాయణ, ఇందుపల్లి బాల, మద్దుకూరు శ్రీను పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

#### శ్రీమహాకాళీ అమ్మవారి సన్నిధిలో మంత్రి సవిత

శ్రీమహంకాళీ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్.సవిత ఆదివారం దర్శించుకున్నారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం అమ్మవారు లక్షగాజుల అలంకరణతో భక్తులకు కనువిందు చేశారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రి సవితకు అర్చకులు, దేవదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ ఈఓ డీసీహెచ్ వెంకటరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు అమ్మవారి చిత్రపటంతో పాటు ఆషాడసారెను బహూకరించారు. అర్చకులు తారక్‌నాథ్ శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మణిశర్మలు శుభాశీ ర్వచనం అందించారు.

## 47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ప్రత్తిపాడులోని పౌల్ట్రీఫారంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొన్న రేషన్ బియ్యం

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు కూడా తరలిస్తున్నారు. పేద ప్రజలు వండుకొని తినాల్సిన బియ్యాన్ని కోళ్లకు దాణాగా పెడుతున్నారు. జొన్నలు, సజ్జలు ఇతర ధాన్యాలతో పోల్చితే రేషన్ బియ్యం తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీఫారం యజమానులు కూడా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే ఈశ్వరరావుకు ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలోని బాలాజీ పౌల్ట్రీ ఫారం నిర్వాహకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొని, నిల్వచేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఆ మేరకు ఆయన విజిలెన్స్ అధికారులు, సిబ్బందిని పంపించి బాలాజీ పౌల్ట్రీ ఫారంను మండల రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా అక్కడ 92 బియ్యం బస్తాలపై ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అని ముద్రలు ఉన్నాయి. ఒక్కో బస్తా 50 కేజీల చొప్పున 46.00 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఇవి కాక 5 తెల్ల సంచులలో 1.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉండటాన్ని గమనించారు. పౌల్ట్రీ ఫారంలో మొత్తం 47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. విచారణలో పౌల్ట్రీ ఫారం లీజుదారైన నాగవరపు సురేష్ పౌల్ట్రీ ఫీడ్ ఖర్చు తగ్గించుకొనుటకు, పరిసర గ్రామాలలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వినియోగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 47.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనపరచుకొని, యజమాని నాగవరపు సురేష్‌పై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా స్థానిక రెవెన్యూ అధికారిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ శ్రీనివాసులురెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బరితెగించిన మాజీ ఎంపీ సురేష్ అనుచరులు

తుళ్లూరు, జూలై 14: రాజధాని ప్రాంతంలో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు, బంధువుల ఆగడాలు ఆగటం లేదు. మోదులింగాయపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి ఉద్దండ్రాయునిపాలెం లంకలోకి ఆదివారం కూలీలకు భోజనం తీసు కుని వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎంపీ అనుచరులు కరకట్ట మార్గంలో బైకులు అడ్డంగా పెట్టారు. బురదగా ఉంది దారి వదలమని శ్రీనివాసరావు వారిని కోరాడు. దాంతో రెచ్చిపోయిన ఎంపీ అనుచరులు శ్రీనివాసరావును చితక బాదారు. ఈ ఘటనపై బాధితుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసినట్టు తుళ్ళూరు సీఐ-2 అనురాధ తెలిపారు.

## అభివృద్ధి కారకులనే టీడీపీ ప్రోత్సహిస్తుంది

- ప్రగతిపథంలో పయనిస్తున్న రాష్ట్రం
- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

గుంటూరు, జూలై 14: తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి కారకులను ప్రోత్సహిస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ తాము చేసిన కార్యక్రమాలన్నింటిని గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇకపై అభివృద్ధికి ఎలాంటి అవరోధాలు ఉండవన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాబు మానసపుత్రిక అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయటానికి సన్నాహాలు చేస్తుందన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. త్వరలో అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించి టీడీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపిస్తుందన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్టీఆర్ భరోసా పేరుతో పెంచిన పెన్షన్ మొత్తాన్ని మొదటి నెలలోనే అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు అందజేసిందన్నారు. ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టి, ఇది చేతల ప్రభుత్వం అని నిరూపించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఒక పక్క వ్యవస్థలను గాడిలో పెటుడుతూ మరో పక్క రాష్ట్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని లేని రాష్ట్రంగా చిన్నాభిన్నం చేశారన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అమరావతి రాజధానికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి యువతకు భరోసా కలిపించింది. ఎస్సీ , ఎస్టీ, బీసీల కార్పొరేషన్‌లతో పాటు సబ్ ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించి వారి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు. వెసీపీ ప్రభుత్వం పంచాయితీల నిధులను దారి మళ్లించి సర్పంచ్ లను డమ్మీగా చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు.

### 15, 16న ఫిరంగిపురంలో కార్మెల్ మాత మహోత్సవాలు



పూజలు అందుకోనున్న కార్మెల్ మాత

ఫిరంగిపురం, జూలై 14: ఫిరంగిపురంలోని కార్మెల్ కొండపై ఈనెల 15, 16 తేదీల్లో కార్మెల్‌మాత ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ ఉత్సవాలలో లక్షలాది మంది భక్తులు పాల్గొని తరిస్తుంటారు. గ్రామంలోని కార్మెల్ కొండపై 1981లో లండన్ మిల్‌హిల్‌కు చెందిన ఫాదర్ థియేటర్ డిక్మన్ దేవాలయాన్ని నిర్మింపచేశారు. అప్పటినుంచి ఆర్‌సీఎం క్రైస్తవ భక్తులతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గురువులు, కన్యా స్త్రీలు, భక్తులు వచ్చి మొక్కు తీర్చుకుంటుంటారు. పండుగలో ఉచితంగా తాగునీరు, భోజన వసతి, ఉండేందుకు సత్రశాలలు ఏర్పాటు చేసినట్టు చర్చి ఫాదర్ పాతిమా మర్రెడ్డి తెలిపారు. 15వ తేదీ ఉదయం కొండమీద పూజ, సాయంత్రం 5గంటలకు దివ్య సత్ప్రసాదం, మరియమాత స్వరూపాలతో భారీ ఊరేగింపు, అనంతరం గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య సందేశం ఉంటుందన్నారు. అదేవిధంగా 16వ తేదీ కార్మెల్ కొండపై సమష్టి దివ్య పూజాబలి ఉంటాయని ఆయన తెలిపారు.

## జనసేన కార్యకర్తకు కత్తిపోట్లు



కత్తిపోటు గాయంతో వైద్యశాలకు వస్తున్న ఫయాజ్‌బాషా

తెనాలి రూరల్, జూలై 14 : జనసేన పార్టీ కోసం పని చేశాడని కక్ష పెంచుకుని అతనిని వైసీపీ అరాచక మూకలు కత్తితో పొడిచారు. బాధితుడు, స్థానికులు, కటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్‌బాషా (28) వెండి ఆభరణాలు తయారు చేసే పనిచేస్తుంటాడు. ఇటీవల ఎన్నికల్లో ఫయాజ్‌బాషా జనసేన పార్టీకి మద్దతు తెలిపి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ కూటమి విజయానికి పనిచేశారు. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో జనసేన పార్టీ దిమ్మెను సైతం ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో గ్రామ సెక్రటరీతో దిమ్మెకట్టవద్దని గ్రామ ప్రెసిడెంట్ బాషాకు అడ్డు తగిలే ప్రయత్నం చేయగా అది ఫలించలేదు. దీంతో కక్షపెట్టుకున్న వైసీపీ నాయకులు ఆదివారం ఫయాజ్ బాషా తన అమ్మమ్మ ఇంటికి వెళుతున్న క్రమంలో గ్రామ ప్రెసిడెంట్ వైసీపీ నాయకుడు బాషా, సుభాని, రబ్బాని కలిసి కత్తితో పొడిచారు. దీంతో రక్తగాయాలతో ఉన్న ఫయాజ్‌బాషాను గ్రామస్తులు హుటాహుటిన తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘనటపై పోలీసులు విచారణ చేపట్టారు.

## వేగం పుంజుకున్న గూడూరు-విజయవాడ మూడో రైల్వేలైన్ పనులు

తెనాలి క్రైం, జూలై 14: విజయవాడ-గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణ పనులు వేగం పుంజుకున్నాయి. మరో ఏడెనిమిది నెలల్లో ఈ మార్గంలో మూడో లైను అందుబాటులోకి రానున్నదని అధికారులు వెల్లడించారు. గూడూరు-బిట్రగుంట, బిట్రగుంట-కరువది, కరువది-కృష్ణాకెనాల్ మధ్య మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే గూడూరు నుండి చుండూరు రైల్వేస్టేషన్ వరకు మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణలు పూర్తి అయ్యాయి. కరువది నుండి బాపట్ల వరకు మూడో లైనుపై రైళ్ళ రాకపోకలు కొనసాగుతున్నాయి. కరువది-విజయవాడ మధ్య రూ.1046కోట్లతో పనులు సాగుతున్నాయని 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేసి మూడో లైను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్గంలోని మోదుకూరు, స్టూవర్టుపురం, కడవకుదురు, కొత్తపందిళ్ళపల్లి, ఈపూరుపాలెం, జాండ్రపేట, కొలకలూరు, కొలనుకొండ వంటి ఎనిమిది చిన్న స్టేషన్లలో ఫుట్‌బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారాల నిర్మాణాలు పూర్తయ్యాయి. స్టేషన్లు కూడా ఆధునీకరించడం, ప్రయాణికులకు తాగునీరు, తగిన సీటింగ్ వసతి, టాయిలెట్స్ వంటి సదుపాయాలతో పాటు ఆయా స్టేషన్లలో అధునాతన సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే ఈనెల 16నుండి 30వ తేదీ వరకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగనున్నాయని, దీంతో ఈ మార్గంలో నడిచే కొన్ని ట్రైన్స్ పూర్తిగా రద్దు చేయడం, మరికొన్ని దారిమళ్ళించడం, కొన్ని ట్రైన్స్ రీషెడ్యూల్ చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గూడూరు-విజయవాడ రైలుమార్గం ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా మారనున్నదన్నారు. మూడో లైను నిర్మాణం పూర్తి కాగానే నాలుగో లైను నిర్మాణానికి కూడా రైల్వే అధికారులు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తున్నది. దీనికి సంబంధించి ప్రాథమిక అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.





చుండూరు-పొన్నూరు స్టేషన్ల మధ్య జరుగుతున్న విద్యుదీకరణ పనులు, చుండూరు రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ట్రాక్ పనులు

## పెదకాకాని మల్లేశ్వరుని సన్నిధిలో రాజధాని రైతులు

- పాదయాత్రగా వచ్చిన రాజధాని మహిళలు, రైతులు
- స్వాగతం పలికిన పెదకాకాని మండల టీడీపీ నాయకులు



పాదయాత్రగా వచ్చిన రాజధాని రైతులకు, మహిళలకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పెదకాకాని, జూలై 14: రాజధాని మహిళా రైతులు అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని కోరుతూ 1600 రోజులుగా దీక్షలు చేపట్టారు. వారి దీక్షలు ఫలించి ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయి అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉంటుందని, రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజధాని మహిళలు పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి మొక్కుబడి కోసం ఆదివారం పాదయాత్రగా బయలుదేరి పెదకాకాని సెంటర్‌కు చేరుకున్నారు. వారికి పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా రైతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజధాని రైతులు చేసిన త్యాగాలు చూసిన ఆంధ్రప్రదేశ్ ఓటర్లు రాష్ట్రంలో కూటమి అధికారంలోకితెచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు నియోజకవర్గం తెలుగుయువత అధ్యక్షుడు మేడ వెంకటకృష్ణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, పెండ్యాల నాగేశ్వరావు, యడ్లపల్లి మధు, షేక్ మజాహార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, జూలై 14: ట్రైన్ నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. తెనాలి రైల్వే పోలీసుల కథనం మేరకు.. తెనాలి-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం 60-65సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ట్రైను నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడిపై తెల్లషర్టు ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని, జూలై 14: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. తక్కెళ్ళపాడు అడ్డరోడ్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, వాహనదారుడికి తీవ్రగాయాలు అయ్యాయి.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 119, 127, 137 |
| చికెన్ విత్ స్కిన్ | 226.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 236.00 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



డయేరియా బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారులు

## డయేరియా కేసులు తగ్గుముఖం..

- ముమ్మర పారిశుధ్య చర్యలు, వైద్య సేవలతో అదుపులోకి..
- ఇంటింటి సర్వేలో వైద్యాధికారుల వెల్లడి

పిడుగురాళ్ల, జూలై 14: పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని వైద్యాధికారులు తెలిపారు. వైద్యాధికారులు ఆదివారం ఆయా ప్రాంతాలను సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించారు. డయేరియాతో బాధపడే వారిని గుర్తించడంతో పాటు వారం దరికీ ఇంటివద్దకే వైద్యం అందేలా వైద్యులు పని చేస్తున్నారు. ఈ క్రమంలో బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను అందజేశారు. పరిశుభ్రమైన నీటిని కాచి చల్లార్చి తర్వాత తాగడంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా వుంచుకోవాలని వైద్యాధికారులు గత నాలుగు రోజులుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి ఒకటి, రెండు స్వల్ప ప్రభావిత కేసులు మాత్రమే మోదయ్యాయని, వారికీ తక్షణ వైద్య సాయం అందించటంతో కొంత ఉపశమనం పొందారని వైద్యాధికారులు తెలిపారు. డయేరియా అదుపులోకి వచ్చినట్లుగా గుర్తించారు. రెండు రోజుల్లో డయేరియా పూర్తిగా తగ్గేలా అన్నిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవితేజ, పద్మావతి, నస్రీన్, అనిల్ కుమార్, బాలాజీ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి పాల్గొన్నారు.

**బాధితులను పరామర్శించిన సీపీఎం నేతలు**

లెనిన్‌నగర్ ప్రాంతంలో డయేరియా బాధితులను ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పరామర్శించారు. మారుతీనగర్, లెనిన్ నగర్, సంద్రపాలెం ప్రాంతాలలో నీటి కలుషితమై ప్రజలు డయేరియా బారినపడ్డారని, మృతిచెందిన కార్మికులకు ప్రభుత్వం సహాయం అందజేయాలన్నారు. పరిస్థితి మెరుగుపడేదాకా ప్రభుత్వమే సురక్షితమైన మంచినీటిని ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో తెలగపల్లి శ్రీను, వెంకటేశ్వర్లు, బాబు, సంపతి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో జీపీఎస్ గజిట్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఫ్ నేతలు

## జీపీఎస్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

పిడుగురాళ్ల, జూలై 14: గత ప్రభుత్వం ఎటువంటి విధి విధానాలు రూపొందించకుండానే జీవో నెం.54 ప్రకారం జీపీఎస్ అమలు చేస్తూ ఇటీవల విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని యూటీఫ్ నేతలు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆదివారం పిడుగురాళ్ల యూటీఎఫ్ కార్యాలయం వద్ద గజిట్ ప్రతులను వారు దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దుచేస్తానని చెప్పి అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ జీపీఎస్‌ను తీసుకొచ్చాడని అన్నారు. ఈ జీపీఎస్ నోటిఫికేషన్‌ను రద్దుచేసి పాత సీపీఎస్‌ను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు షేక్ ఖాశింపీరా, ఎం సాంబశివరావు, జమాల్, విశ్వరూపాచారి, గోను ప్రసాద్, ఫిరోజ్ భాష, నాగేశ్వరరావు, హను మంతరావు తదితరులు పాల్గొన్నారు.

**రెంటచింతల:** ఉద్యోగ ఉపాధ్యాయులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్, ఎస్టీయు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జీవో నంబరు 117ను రద్దు చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, పీఆర్సీ కమిటిని నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ చిన్నమ్మ, బిచ్చిరెడ్డి, నాసరయ్య, లేళ్ల శ్రీనివాసరావు, గురుచంద్రశేఖర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను బలోపేతం చేయాలి

రెంటచింతల,జూలై 14 : అంగన్‌వాడీ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని టీడీపీ సీనియర్ నేత డీసీ మాజీ ఛైర్మన్ నల్లబిరుదు నరశింహారావు కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారని, దీంతో అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల సంఖ్య పడిపోయిందన్నారు. ఈవిషయంపై వెంటనే ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో 39 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, సూపర్‌వైజర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, గత ప్రభుత్వానికి భిన్నంగా మెరుగ్గా వ్యవహరించాలన్నారు. సమావేశంలో కె.లక్ష్మీనారాయణ,మాజీ సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

## అంతర్గత రోడ్డు నిర్మాణం చేయాలి



అధ్వానంగా తయారైన రహదారి

అచ్చంపేట, జూలై 14: మండలంలోని కోనూరు - అంబడిపూడి గ్రామాల మధ్యగల అంతర్గత రోడ్డు అధ్వానంగా మారటంతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంటలమయమైన ఈరోడ్డు చిన్న వర్షంపడితే చెరువుని తలపిస్తుంటుందని, వాహనదారులు వెళ్ళేందుకూ అవకాశం కూడా ఉండదని ఆయా గ్రామస్థులు తెలిపారు. ఈరెండు గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రోడ్డును నిర్మిస్తే సమస్యలు తొలగుతాయని, తక్షణమే ఈ రోడ్డుపై అధికారులు దృష్టి సారించి అంతర్గత రహదారిని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామ దేవత దేశమ్మ తల్లి వద్దకు పొంగళ్లు సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

## దేశమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో పొంగళ్లు

పెదకూరపాడు, జూలై 14: పెదకూరపాడు మండలంలోని 75 తాళ్ళూరులో గ్రామదేవత దేశమ్మతల్లికి మహిళా భక్తులు ఆదివారం పొంగళ్లను సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాడంలో సామూహికంగా దేశమ్మ తల్లి ఉత్సవానికి గ్రామంలో అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. మహిళలు ప్రభను ఏర్పాటుచేసి మేళ తాళాలతో అమ్మవారి వద్దకు వెళ్ళి నైవేద్యాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. కార్యక్రమాన్ని పెదకాపు, మునసుబ్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు.

## వ్యాపారవర్గాలకు స్వేచ్ఛా వాతావరణం

చిలకలూరిపేట అర్బన్, జూలై 14: ఐదు సంవత్సరాల అరాచక వైసీపీ పాలన పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యాపార వర్గాలు స్వేచ్ఛగా వర్తక, వాణిజ్యాలు చేసుకునే పరిస్థితి నెలకుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పైస్థాయి నుంచి కింది స్థాయి నేతల వరకు కప్పాలు కట్టి అలసిపోయిన వ్యాపారులు ఇప్పుడెలాంటి భయాలు లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఆదివారం శ్రీవెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపం నూతన కమిటీ సభ్యులు ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. అధ్యక్షుడు డాక్టర్ అర్వపల్లి సురేష్ కుమార్, కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, కోశాధికారి రాజీవ్, సభ్యులు ప్రత్తిపాటిని కలసిన వారిలో ఉన్నారు.

# పేటసన్నిగండ్లకు సాగునీరు దక్కేనా ?

- ఎత్తిపోతల పథకం పూర్తయినా బీళ్లుగా పొలాలు
- పైపులైన్ల లీకేజీలతో పడకేసిన పథకం
- హామీ అమలుని విస్మరించిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి
- ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిపైనే రైతులు ఆశలు..



ఎత్తిపోతల పథకానికి నీరు అందించే బావి

కారంపూడి, జూలై 14: మండలంలోని పేటసన్నిగండ్ల ఎత్తిపోతల పథకం పూర్తయి 15 ఏళ్లయినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. వందలాది ఎకరాలు బీళ్లుగా మారుతున్నా పట్టించుకునే వారే లేరు. 'పథకం పూర్తి చేస్తాం అంటూ ప్రగల్బాలు పలికిన పాలకులు సైతం చేతులెత్తేశారు.. నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సారైనా ఈ పథకం అమలుకు నోచుకుంటుందని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు..

నాగార్జున సాగర్ కుడి కాలువకు పక్కనే పేటసన్నిగండ్ల గ్రామం ఉన్నా చుక్క సాగునీరు కూడా అందదు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉండడంతో తాగునీటి సమస్య తీవ్రత అధికంగా ఉంది. దీనికితోడు ఓ పొలంలో బోరు ఏర్పాటు చేస్తే నీరు పడినప్పటికీ కొద్ది దూరంలో పొలంలో ఎక్కువ లోతులో డ్రిల్లింగ్ చేస్తే మొదట పొలంలో బోరుకు నీరు అందని దుస్థితి. దీంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ గ్రామానికి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. సుమారు రూ. 4 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. ఆసమయంలో ఎమ్మెల్యేగా ఉన్న పిన్నెల్లి లక్ష్మారెడ్డి ఈ పథకానికి శంకుస్థాప చేశారు. గుత్తేదారు 2010 నాటికి ఈ పథకం నిర్మాణ పనులు పూర్తిచేశారు. నాగులేటి పైభాగాన నిర్మించిన ఈ పథకంలో భాగంగా నిర్వాహణ మోటారు గది, నీరందించే బావులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు 1255 ఎకరాలకు సాగునీరు అందించడానికి అండర్‌గ్రౌండ్ పైపులైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్ల నిర్మాణం లోప భూయిష్టంగా సాగడంతో లీకేజీలు ఏర్పడి నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ భూములకు సాగునీరు అందలేదు.

గుత్తేదారు తన పని పూర్తయిందని బిల్లు తీసుకొని ఉడాయించారు. పథకం తీరు మరలా మొదటికొచ్చింది. పర్యవేక్షించాల్సిన చిన్నతరహా నీటి పారుదల శాఖ అధికారులు మాత్రం రైతులంతా ఓ సంఘంగా ఏర్పడి పైపులైన్లు నిర్మాణం చేసుకోండంటూ సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇలా మరో ఎనిమిదేళ్లు గడిచిపోయింది. పట్టించుకునే నాధుడే కరువవడంతో నిరూపయోగంగా మారింది. 2019 ఎన్నికలొచ్చాయి. ఎన్నికల సమయంలో పేటసన్నిగండ్ల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి తీరుతాం అని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రగల్భాలు పలికారు. ఐదేళ్ల అధికారంలోకి ఉన్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు పలుమార్లు రామకృష్ణారెడ్డిని కలిసినప్పటికీ నిరాశే మిగిలింది. కాగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల శాసనసభ్యునిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఈపథకంపై దృష్టి సారించి ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



ఎత్తిపోతల పథకం మోటారును ఏర్పాటు చేసిన గది



పిచ్చి చెట్ల మధ్య పథకం నిర్వహణకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

## బదిలీ అధికారులకు వీడ్కోలు..

క్రోసూరు, జూలై 14 : పల్నాడు జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న ఐఏఎస్ అధికారులు లోతేటి శివశంకర్, శ్యాంప్రసాదుకు క్రోసూరుకు చెందిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు ఘనంగా వీడ్కోలు చెప్పినట్టు తెలిపారు. నరసరావపేట పట్టణంలోని నిర్వహించిన ఈ వీడ్కోలు కార్యక్రమంలో తమ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించినట్టు తెలిపారు. శ్యామ్ ప్రసాదు, శివశంకర్ జిల్లాలో విధులు నిర్వహించేటప్పుడు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీకి ఎంతో అండగా ఉన్నారని, వారు ఇచ్చిన సలహాలు, సూచనలు తమ కమిటీకి ఎంతో ఉపయోగపడ్డాయని దాసు అన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు చిలకా భాస్కరరావు, పెదకూరపాడు నియోజకవర్గ కన్వీనర్ కంచర్ల అచ్యుత్ పాల్గొన్నారు.



ఏడవ షరఘత్ వేడుకల్లో భాగంగా పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

## భక్తి శ్రద్ధలతో ఏడవ షరఘత్ వేడుకలు

క్రోసూరు, జూలై 14 : మొహరం పండుగలో భాగమైన ఏడవ షరగత్ వేడుకలను ఆదివారం క్రోసూరు మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పీర్ల చావిడిల నుంచి పీర్లను బయటకు తీసి అందంగా అలంకరించి గంధంతోను సాంబ్రాణితోను పూజిస్తూ గ్రామంలో ఊరేగించారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో నైవేద్యం చేస్తారని, హిందూ, ముస్లింలు కలసి కట్టుగా ఈ వేడుకల్లో పాల్గొంటారని దొడ్లేరుకు చెందిన పలువురు ముస్లిం భక్తులు తెలియ జేశారు. ఏడవ షరగత్ నుంచి 10వ షరఘత్ వరకు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహి స్తామని వారు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త మనువళ్ళు ఐన హస్సేన్, హుస్సేన్ లోక కళ్యాణం కోసం మొహరం పండుగ రోజు ప్రాణ త్యాగాలు చేశారని, ఇస్లాం క్యాలెండర్ మొహరం పండుగ నుంచి ప్రారంభ మవుతుందని, ఈపండుగను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని హసానాబాద్‌కు చెందిన ముస్లింలు తెలియజేశారు. మండలంలోని క్రోసూరు, పీసపాడు, నాగవరం, హసానాబాద్, ఊటుకూరు గ్రామాల్లో ఈపండుగను నిర్వహిస్తున్నారు. దొడ్లేరులో జరిగిన వేడుకల్లో ముస్లిం పెద్దలు చినసూరి, సయ్యద్ ఖాశిం పాల్గొన్నారు.

రెంటచింతల : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహరం పూజలు ఆరంభమయ్యాయి. ఏడవ రోజైన శనివారం రాత్రి తుమ్మకోటలోని మెయిన్ సెంటర్లో అలావు నిర్వహించారు. పీర్లచావిడిలో పీర్ల స్వాములు కొలువు దీరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పీర్లను వెండి కిరీటాలతో అలంకరించారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెక్కెర, బెల్లం చదివింపులు చేయించుకుని పీర్లను దర్శించుకున్నారు. ఈనెల 17న పీర్లు జలాధికి వెళ్తాయని నిర్వాహకులు తెలిపారు.

## బావిలో వ్యక్తి మృతదేహం

- భార్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు

రాజుపాలెం,జూలై14: మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలోని ఓ బావిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. మండల కేంద్రమైన రెంటచింతల సమీపంలోని ఎస్టీ కాలనీకి చెందిన అల్లూరి అంకమ్మరావు(32) జీవనోపాధి నిమిత్తం సంవత్సరం క్రితం రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామ సమీపంలోని కోళ్ళఫారం పనిచేసేందుకు కుటుంబంతో సహావచ్చాడు. ఆదివారం ఉప్పలపాడుకు చెందిన ఓ మహిళ పొలానికివెళ్తూ పక్కనే ఉన్న బావిలోకి చూసింది. బావిలో మృతదేహం కనిపించడంతో ఆ విషయాన్ని గ్రామంలోని పలువురికి తెలియజేయగా, వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న దుర్గ బావి వద్దకువచ్చి చూడగా మృతదేహం తన భర్త అంకమ్మరావుదేనని గుర్తించింది. తన భర్త అంకమ్మరావు ఈనెల 12వ తేది ఉదయం 10 గంటలకు కోళ్ళఫారం నుంచి బయటకు వెళ్లాడని, తర్వాత తిరిగి రాలేదని తెలిపింది. అయితే ఆమె అంకమ్మరావు మృతదేహాన్ని పరిశీలించి అనుమానం వ్యక్తం చేసింది. భార్య దుర్గ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ షామీర్‌బాషా అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

## ఆర్థికసాయం అందజేత

పిడుగురాళ్ల, జూలై 14: పట్టణంలోని 4వవార్డులో నివాసం ఉంటున్న కురెళ్ల రాంబాబు మనవరాలు రమ్య వైద్యఖర్చుల నిమిత్తం టీడీపీ నేతలు ఆదివారం రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న రమ్యకు 2016లో అప్పటి ఎమ్మెల్యేగావున్న యరపతినేని శ్రీనివాసరావు సీఎం చంద్రబాబుతో మాట్లాడి లివర్ శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు మంజూరు చేయించారు. ఇప్పుడు మళ్లీ రమ్య ఆరోగ్య స్థితి బాగోలేకపోవడంతో వైద్యఖర్చుల నిమిత్తం టీఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు యరగాని వెంకట్(లడ్డు) స్పందించి ఆర్థికాసాయం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలి, ఖాశింసైదా, వాచర్‌బుడే, కొండలు, గాలయ్య, సైదా, కంభంపాటి సూర్య, షేక్ సైదా, మళ్ల వెంకటరావు, సతీష్, కుర్షీద్, నాయబ్ రసూల్, బూర్సు శ్రీను, సూరి, రంగారావు, నారబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి, జూలై 14: మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం మాచర్ల పట్టణానికి చెందిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి జూలకంటి శోభారాణి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోట శబరిగిరీష్, చింతా కృష్ణచైతన్య, సుష్మారెడ్డి, చెన్నారెడ్డి, వేపూరి రాజేష్, రజిత, శివతేజ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి

## ముగిసిన వారాహి అమ్మవారి నవరాత్రులు



దాచేపల్లి అంకమ్మతల్లి దేవాలయంలో వారాహి పూజలకు హాజరైన భక్తులు

దాచేపల్లి, జూలై 14: ఆషాడమాసంలో వారాహి అమ్మవారి నవరాత్రులు ఆదివారంతో ముగిశాయి. 8రోజులుగా అమ్మవారి ఆలయంలోని వీర్ల అంకమ్మతల్లిని వారాహిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండాది పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన నవరాత్రులు చివరి రోజున ఆదివారం వారాహి హోమాన్ని నిర్వహించారు. రైతులు పాడిపంటలతో సుఖంగా వుండాలని, సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర మహిళా మండలి, శ్రీ వాసవి, అంకమ్మతల్లి భక్తసమాజం ఆధ్వర్యంలో లలితా పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యలమల నరేష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**నకరికల్లు :** మండలంలోని కుంకలగుంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి దేవి తొమ్మిదవ రోజైన ఆదివారం పుణ్య దంపతులు పూజల్లో, హోమాల్లో పాల్గొన్నారు. ఉత్కంఠ వీరభద్ర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భద్రకాళి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చక స్వామి మామిళ్ళపల్లి విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు.



కుంకలగుంట వీరభద్ర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతా !

- కార్యకర్తల గౌరవం పెంచుతా.. అండగా ఉంటా..
- పార్టీ శ్రేణులతో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 14: గురజాల నియోజకవర్గాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పిడుగురాళ్ల పట్టణంలో మండల పార్టీ కూటమి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు, అవమానాలు పడ్డారని, ఎక్కడైతే అవమానపడ్డారో అక్కడే వారికి తగిన గౌరవం పెంచేలా చూస్తానని యరపతినేని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరిని వదలబోనని, చట్ట ప్రకారమే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గురజాలలో రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసిన జంగా కృష్ణమూర్తిని కాసు మహేష్‌రెడ్డి ఎంతో అగౌరవపరిచారన్నారు. 2014-19 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తప్ప అనంతరం కాలంలో మరేమీ జరగలేదని యరపతినేని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకాన్ని కలిగి ఉన్నారని, అందుకనుగుణంగానే తాము నడుచుకుంటామన్నారు. గ్రామాల వారీగా ఏయే పదవులు ఎవరికి ఇవ్వాలో ఉమ్మడిగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాని తెలిపారు.



సమావేశానికి హాజరైన కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు

తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ వున్నం నాగమలికార్జునరావు, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గండికోట వెంకటేశ్వర్లు, యడ్లపల్లి నారాయణ, పాండురంగ శ్రీను, యడ్లపల్లి శివ, మేకల రాంబాబు, వున్నం సురేష్, సాదం హనుమయ్య, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, నెక్కంటి శ్రీను, రామ్మూర్తి, ముప్పాళ్ల సాంబయ్య, పరుచూరి వెంకటరమణ, పాదర్తి రాజేశ్వరి, బీజేపీ, జనసేన నాయకులు హనుమంతరావు, వెంకయ్య, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా పాల్గొన్నారు.



కనకదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే యరపతినేని

## అమ్మవారికి పట్టు వస్త్రాలు

పిడుగురాళ్ల, జూలై 14: పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాడమాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ప్రజలందరూ పాడిపంటలు, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు యరపతినేని తెలిపారు. ముందుగా ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## టీడీపీ నేత కారు అద్దాలు ధ్వంసం

మాచర్లటౌన్, జూలై 14: తన కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేశారని పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన టీడీపీ నేత బీరవల్లి చంద్రశేఖరరెడ్డి ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెహ్రూనగర్ రెండో లైన్ మున్సిపాలిటీ వాటర్ ప్లాంట్ ఆవరణలో రాత్రి 10 గంటలకు ఏపీ16డీక్యూ 3659 నంబరు గల షిఫ్ట్ డిజైర్ కారు పార్కింగ్ చేశానని, ఆదివారం ఉదయం వెళ్లి చూడగా కారు అద్దాలు ధ్వంసమై ఉన్నాయని చంద్రశేఖరరెడ్డి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎంపీ లావు, వెన్నా సాంబశివారెడ్డి

## సీఎం చంద్రబాబుని కలిసిన వెన్నా

బెల్లంకొండ, జూలై 14 : టీడీపీ సీనియర్ నేత, గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి సీఎం చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం వెన్నా సాంబశివారెడ్డి ఎంతో కష్టపడ్డారని, చిత్తశుద్ధితో పనిచేశారని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి వెన్నాకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తానని, ఇబ్బంది లేదంటూ భరోసా ఇచ్చినట్టు తెలిసింది.



నిదానంపాటి అమ్మవారి ఆలయంలో యాగంటి తదితరులు

## మొక్కు చెల్లించుకున్న టీడీపీ నేతలు

మాచర్లటౌన్, జూలై 14: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాలని, మాచర్ల నియోజకవర్గంలో జూలకంటి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని ఎన్నికల ముందు టీడీపీ నేతలు మొక్కుకున్నారు. మొక్కు నెరవేరటంతో ఆదివారం దుర్గి మండలం రాజానగర్‌కు చెందిన టీడీపీ నేతలు అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి చేరుకొని తమ మొక్కు చెల్లించుకున్నారు. అలాగే మాచర్ల మండలం కొత్తపల్లి సమీపంలోని బంగారు మైసమ్మ ఆలయంలో పట్టణంలోని 8వ వార్డుకు చెందిన టీడీపీ నేత బాగం హనుమంతు ఆధ్వర్యాన మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, మాజీ కౌన్సిలర్ లెనిన్‌బాబు, దేవళ్లపల్లి నారాయణ, మాగులూరి నారయ్య, కేతావత్ రామోజీనాయక్, రామునాయక్, జ్యోతి, మోరబోయిన శ్రీహరి, మంత్రునాయక్, బద్రునాయక్, గోవిందునాయక్, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట






చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

## పేదల కోసమే ఉచిత ఇసుక విధానం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 14: పేదల సొంత ఇంటి కల నేరవేర్చడానికే ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణం గడియారస్థంభం సెంటర్‌లో ఎన్నికల హామీలో భాగంగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినందుకు భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ట్రక్ ఇసుక కొనడానికి రూ.6 వేలు అయ్యేదని, లారీ ఇసుకు రూ.50వేల నుంచి రూ.70వేల దాకా అయ్యేదని, దీంతో నిర్మాణరంగం కుదేలైందన్నారు. భవననిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందిపడ్డారన్నారు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణరంగం వేగవంతం చేయడానికి ఉచిత ఇసుక ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో మైనింగ్, రోడ్డు వేస్తున్నా వీటన్నింటిని భవననిర్మాణ కార్మికుల కొంతశాతం ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో వేముల పాండురంగారావు, హెచ్‌ఆర్‌డీ సభ్యుడు వల్లెపు నాగేశ్వరరావు, అత్తులూరి సుబ్బారావు, టీడీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, అల్లంశెట్టి మోహనరావు, చింతిరాల బాలు, మాతంగి బంగారం, జనసేన నాయకులు ఆదేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, సంజీవరావు, గట్టు సత్యనారాయణ, భవననిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

## ముగిసిన వారాహి నవరాత్రులు

నరసరావుపేట అర్బన్, జూలై 14: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వారాహి నవరాత్రుల సందర్భంగా కుంకుమ పూజలను ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## హత్యాయత్నం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ



గోతిని పరిశీలిస్తున్న ఏఎస్పీ,సీఐ

ఈపూరు, జూలై 14: మండలంలోని ముప్పాళ్ళ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద ఈ నెల 13వ తేదీ సాయంత్రం తెలంగాణ రాష్ట్రానికి చెందిన తల్లీ, కొడుకు శైలజ, శివలపై హత్యాయత్నం జరిగిన ప్రదేశాన్ని ఆదివారం పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి సందర్శించారు. ఆ ప్రదేశంలో తీసిన గోతిని అందుకు ఉపయోగించిన పారను పరిశీలించారు. ఆచుట్టుపక్కల ముళ్ళ పొదలను పరిశీలించారు. మహిళను ఆమె కొడుకును కాపాడిన పవర్ ప్లాంట్ సిబ్బందిని, గ్రామస్థులను విచారించారు. అనంతరం బాధితులు శైలజ, శివలను సంఘటన జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. హత్యాయత్నాకి పాల్పడిన ముద్దా శ్రీను ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఏఎస్పీతో పాటు వినుకొండ రూరల్ సీఐ సుధాకర్,ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మద్యం బాబుల హల్‌చల్

రొంపిచర్ల, జూలై 14: మండలంలోని రొంపిచర్లలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మద్యం బాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఆలయం వద్ద మద్యం సేవిస్తూ ఆలయ పవిత్రతను చెడగొడుతున్నారు. గతంలో పోలీసులు ఆలయాల వద్దకు ఒకటి రెండుసార్లు వచ్చేవారు. ఐతే ఆలయాల సందర్శన లేకపోవటంతో మద్యం బాబులు వీరంగం సృష్టిస్తున్నారు. ఆలయాల పవిత్రతను కాపాడేలా దేవదాయ శాఖ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### ఘనంగా పీర్ల ఊరేగింపు

రొంపిచర్ల, జూలై 14: మండలంలోని పలు గ్రామాల్లో మొహరం పర్వదినం సందర్భంగా పీర్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రొంపిచర్లలోని బొడ్డురాయి, గ్రంథాలయం బజార్ల వద్ద పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. సంతగుడిపాడు, విప్పర్ల, ఎడ్వర్డుపేట, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

### చర్చి స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

ఈపూరు, జూలై 14: మండలంలోని బోడెపూడివారిపాలెంలో వైసీపీకి చెందిన నాయకులు చర్చి స్థలాన్ని ఆక్రమించుకున్నారని వాటిని తొలగించాలని ఎస్సీ కాలనీ వాసులు ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న లూథరన్ చర్చి స్థలం ఆక్రమంచి పశుల పాకలు వేసుకున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు తీసుకోలేదని కాలనీకి బేతం సురేష్ మరికొందరు కాలనీవాసులు తెలిపారు. ఆక్రమణలు తొలగించమని అడగగా దావులూరి రాజా తమను దూషించినట్లు వారు ఆరోపించారు. ఆక్రమణలు తొలగించి చర్చి స్థలాన్ని కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడు రామాచారికి సత్కారం

వినుకొండ. జూలై 14: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వీసీహెచ్ రామాచారి ఉద్యోగ విరమణ అభినందన సభ స్థానిక వీఎల్ఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంకిత భావం, క్రమశిక్షణ వీసీహెచ్ రామాచారిలో పుష్కలంగా ఉన్నాయని వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ బోడెపూడి హనుమయ్య బి.నాగేశ్వరరావు, కేజి రమేష్, ఎన్ఆర్ హనుమంతాచారి, ఎంఈవో సాంబశివరావు, ప్రసన్న, ఎస్‌టీయూ చంద్రజిత్ యాదవ్ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కమిటీ ఏర్పాటు



గడిపూడి వెంకట్రాయుడు

పోట్లూరు (శావల్యాపురం) జూలై 14: మండలంలోని పోట్లూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు గ్రామంలోని జడ్పీ పాఠశాలలో గ్రామ పెద్దలు ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పెద్దలు స్థానిక శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పోట్లూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని గతంలో హామీనిచ్చినందుకు ఎమ్మెల్యే జీవీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల పోట్లూరు జడ్పీ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మతో పాటు ఉపాధ్యాయులను గ్రామపెద్దలు అభినందించారు. అనంతరం గ్రామానికి చెందిన అబ్బూరి శ్రీనివాసరావు సారథ్యంలో పెద్దలతో కమ్యూనిటీ హాలు నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గడిపూడి వెంకట్రాయుడు మాట్లాడుతూ గ్రామ పెద్దలు, గ్రామస్థులు, యువత సహకారంతో కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామంలోని మిట్టమీద బజారు, ఉత్తర బజార్ల పెద్దల వద్దనున్న గ్రామ నిధులను కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విరాళంగా ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై వీరవల్లి ప్రతాప్, నన్నూరి వీరరాఘవులు, గడిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సమస్యల పరిష్కారానికి కృషి

● శాశ్వతంగా తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

● 59వ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 14: తన కుటుంబం ప్రజా సేవకు అంకితం అని, వారసత్వంగా తన తనయుడు హరీష్ కూడా శివశక్తి ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవ చేస్తాడని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశాడు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పుట్టిన రోజు వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు, ప్రజలు వేలాదిగా పాల్గొని బొకేలు, శాలువాలు, పూలమాలతో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు ఏర్పాటుచేసిన భారీ కేక్



టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

కట్‌చేసి పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ గుంటూరు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లముల వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చానని, పేదల కష్ట నష్టాలు చూసి, సేవ చెయ్యాలని అంకిత భావంతో ముందుకు వచ్చానన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నాని తెలిపారు. తాను చేస్తున్న ప్రజా సేవకు, తన భార్య లీలావతి అందిస్తున్న సహకారం అభినందనీయం అన్నారు. వినుకొండలో శాశ్వతంగా తాగునీరు అందిస్తానని, వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 13లక్షల కోట్లు అప్పుల్లో నెట్టిందన్నారు. అనంతరం నర్సరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందుబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఎన్నికలకు ముందు పల్నాడులో ఏడు అసెంబ్లీ స్థానాలు గెలిపిస్తానని చెప్పిన జీవీ శక్తివంచన లేకుండా కష్టపడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజర్ సింహాద్రి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, టీడీపీ నాయకులు గంగినేని



కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, లీలావతి

ఆంజనేయులు, నాగేశ్వరరావు, రాపర్ల జగ్గారావు, పి.వి సురేష్ బాబు, జనసేన నియోజకవర్గం నాయకులు నాగశ్రీను, ముత్తినేని ఏడుకొండలు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, బాలయ్య కృష్ణ యాదవ్, గోవింద్ నాయక్, జి. సాంబశివరావుతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, టీడీపీ ముఖ్య నాయకుల, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

### నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో...

నరసరావుపేట టౌన్, జూలై 14: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం వినుకొండ శాసన సభ్యుడు జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కుమ్మెత కోటిరెడ్డి, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, షేక్ మన్నాన్ షరీఫ్, షేక్ మహమ్మద్ రఫీ, కోట నాగసుధీర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వినుకొండ పట్టణంలోని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

● బొందిలిపాలెం (శావల్యాపురం)జూలై 14: స్థానిక శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు జన్మదినాన్ని పురస్కరించుకొని శావల్యాపురం మండలం బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ తల్లి దేవాలయంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు పొనుగోటి వెంకట్రావు, మాజీ అధ్యక్షులు సోమేపల్లి వెంకట్రావు, పాపసాని పెదనారయ్య గ్రామ రైతు అధ్యక్షులు చింతా పెదఅంకమ్మ, టీడీపీ నాయకులు చల్లగుండ్ల రాజశేఖర్, జెళ్ళా బాలాజీ సింగ్ పాల్గొన్నారు.

### బధిరుల పాఠశాలలో...

వినుకొండ, జూలై 14: మాజీ శాసన సభ్యుడు మక్కెన మల్లికార్జునరావు యువసేన ఆధ్వర్యంలో విఠంరాజుపల్లి వద్ద గల బధిరుల పాఠశాలల్లో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీవీ సతీమణి లీలావతి పాల్గొని కేక్‌కట్ చేసి పిల్లలకు అందచేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మక్కెన మహేష్, దద్దాల కోటేశ్వరరావు, ముత్తినేని ఏడు కొండలు, ఆంజినేయులు, నలబోతుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ సీనియర్ నాయకులు పీవీ సురేష్ ఆధ్వర్యంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జీవీ పాల్గొని రక్తందానం చేసిన 59మంది యువకులను అభినందించారు. మానవసేవా సంస్థ ద్వారా సురేష్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, యువత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### 2585 మందికి కంటి వైద్య పరీక్షలు

వినుకొండ, జూలై 14: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదినం సందర్భంగా స్థానిక నర్సరావుపేటలోని గంగినేని ఫంక్షన్ హాల్లో శంకర్ కంటి



జీవీ ఆంజనేయులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శివశక్తి లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శుక్లాల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ కంటి ఆసుపత్రి క్యాంప్ ఇన్ చార్జి మేనేజర్ ఆధ్వర్యంలో వైద్యులు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు, వైద్యశిబిరానికి మొత్తం 2585మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 1863మంది వృద్ధులకు కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించినట్లు శివశక్తి మేనేజర్ జీవీ రమణరావు ఆదివారం తెలిపారు.

● వినుకొండ: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకల్లో భాగంగా టీడీపీ సీనియర్ నాయకులు మక్కెన కొండలు, యువ నాయకులు దావులూరి వీరాంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమంలో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని



పిచికలపాలెంలో జీవీ పుట్టినరోజు కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రారంభించారు. కార్యక్రమంలో మాదాల కృష్ణ, సూరాబత్తుని హనుమంతరావు, మాదినేని ఆంజనేయులు, దావులూరి వెంకయ్యబాబు, మల్లాది శ్రీనివాసరావు, పీవీ సురేష్‌పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వేల్పూరు (శావల్యాపురం) జూలై 14: స్థానిక శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలను శావల్యాపురం మండలంలోని వేల్పూరు తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని లైబ్రరీ సెంటర్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత సభ్యులు, మహిళలు పాల్గొని పుట్టినరోజు కేకును కట్ చేసి జీవీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు యువత సభ్యులు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. గ్రామపార్టీ అధ్యక్షుడు యేగినాటి తిరుపతిరావు, తెలుగు యువత అధ్యక్షుడు బోయపాటి మహేష్, పల్నాడు జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాబత్తుని శివప్రసాద్, సీనియర్ నాయకులు బొల్లా పేరయ్య దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, పారా చౌదరి, నాగులపాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సంగినీడుపాలెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● మండలంలోని పిచికలపాలెంలో టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు బోడెపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు గడిపూడి విశ్వనాదం, గోరింట్ల హనుమంతరావు, టీడీపీ నాయకులు పొందూరి బాబు, జాగర్లమూడి బ్రహ్మయ్య, పొందూరి అంజయ్య, తిరువీధి శ్రీనివాసరావు, గాలి వెంకటేశ్వర్లు, పోట్ల ప్రతాప్, ఏదుపాటి సీతారామయ్య, పాములపాటి శ్రీను, యలబోలు శివ తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని సంగినీడుపాలెంలో జీవీ ఆంజనేయులు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్‌ను ఏర్పాటుచేసి కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం పులిహోర, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెలగా బాదరయ్య, యర్ర శ్రీనివాసరావు, సింగినీడి కోటేశ్వరరావు, గొర్రె పెద గురవయ్య, బొక్కా కోటయ్య తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన విద్యార్థులందరికి తల్లికి వందనం అందజేయాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జూలై 14: అర్హులైన విద్యార్థులందరికి తల్లికి వందనం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డియాండ్ చేశారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేస్తుందని ఆరోపించారు. తల్లికి రూ.15వేలు ఇస్తున్నట్లు జీవో జారిచేయటం, మాట తప్పటం కాదా అని ప్రశ్నించారు.

## పులుపుల వెంకటశివయ్యకు ఘన నివాళి

వినుకొండ, జూలై 14: స్వాతంత్ర సమర యోధుడు, ఉద్యమనేత పులుపుల వెంకటశివయ్య 49వ వర్ధంతిని స్థానిక శివయ్య భవన్‌లో ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా శివయ్య చిత్రపటానికి పులమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కమూనిస్టు ఉద్యమంలో ఎనలేని సేవలు అందించారని, ఎమ్మెల్యేగా వినుకొండ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు చంద్రపాటి పైడా, ఉలవులపూడి రాము, లాల్‌ఖాన్, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, ఊట్ల రామారావు, పవన్‌కుమార్, బూదాల చిన్న, షేక్ కిశోర్, ఆర్. వందనం, చౌడయ్య, సత్యానందం, మస్తాన్ మల్లికార్జున, సోడాల సాంబయ్య, రమణ, అంజమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## జీపీఎస్ అమలుపై ఇచ్చిన గెజిట్‌ను రద్దు చేయాలి

నరసరావుపేట టౌన్, జూలై 14: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని తక్షణమే రద్దుచేయాలని ఏపీటీఎఫ్ 1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజ్జం సంపత్ బాబు, పమ్మి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారం రోజులలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కొనసాగించక ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని చూడాలని కోరారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే జీపీఎస్ అమలుకు సంబంధించిన రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చర్చించి పాత పెన్షన్ విదానాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

### 18 నుంచి 28 వరకు జనసేన సభ్యత్వ నమోదు

చిలకలూరిపేట, జూలై 14: ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటేలా బాలాజీ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహా యజ్ఞంలా కొనసాగించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

## పాలనలో కూటమి ప్రభుత్వం తనదైన ముద్ర

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 14: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల స్వల్ప వ్యవధిలోనే పాలనపై స్పష్టమైన ముద్ర వేయటం ఎంతో సంతోషం, సంతృప్తిని కలిగిస్తుందని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 13, 14 వార్డులకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మమేకమై వారి సమస్యలు ఆలకించారు. పట్టణ సమస్యలతో పాటు వార్డుల్లో నెలకొన్న సమస్యలు, నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించి అన్ని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఓడిపోతే సంక్షేమం ఆగిపోతుందని అభాండాలు వేసిన వారెవ్వరూ ప్రజలకు మళ్ళీ ముఖం చూపించుకోలేని స్థాయిలో సీఎం చంద్రబాబు సంక్షేమ శకాన్ని ఆరంభించారని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా పార్టీ కార్యకర్తలు వ్యవహరించాలని ఆయన సూచించారు. మరీ ముఖ్యంగా తల్లికి వందనం పథకంపై వైసీపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. 2019 ఎన్నికల ముందు ఇదే జగన్, అతని సతీమణి ఊరువాడా తిరిగి ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అమ్మ ఒడి ఇస్తామని నమ్మించి మోసం చేశారని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని చూస్తున్నారన్నారు. ఇది ఓర్వలేక కడుపుమంటతో వైసీపీ చేసిన తప్పుడు ప్రచారాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని క్రమపద్ధతిలో నిలబెడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు.

## రోడ్డుపై టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బైఠాయింపు

నరసరావుపేట టౌన్, జూలై 14: పల్నాడు జిల్లా టీడీపీలో రగడ మొదలైంది. జిల్లా కేంద్రం నరసరావుపేటలో టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు శనివారం రాత్రి టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య క్యాంప్ కార్యాలయంలో సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కష్టపడ్డ టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని చల్లా సుబ్బారావు అన్నారు. కొల్లి బ్రహ్మయ్య బయటకి వచ్చి సమాధానం చెప్పాలని ధర్నాకి దిగిన చల్లా సుబ్బారావు, అతని అనుచరులు నినాదాలు చేశారు.

## వ్యాపారవర్గాలకు స్వేచ్ఛా వాతావరణం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 14: ఐదు సంవత్సరాల అరాచక వైసీపీ పాలన పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారవర్గాలు స్వేచ్ఛగా వర్తక, వాణిజ్యాలు చేసుకునే పరిస్థితి నెలకుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పైస్థాయి నుంచి కింది స్థాయి నేతల వరకు కప్పాలు కట్టి అలసిపోయిన వ్యాపారులు ఇప్పుడెలాంటి భయాలు లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఆదివారం శ్రీవెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపం నూతన కమిటీ సభ్యులు ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. అధ్యక్షుడు డాక్టర్ అర్వపల్లి సురేష్ కుమార్, కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, కోశాధికారి రాజీవ్, సభ్యులు ప్రత్తిపాటిని కలసిన వారిలో ఉన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరి సహకారంతో ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. స్థానికంగా ఎవరైనా ఇబ్బంది పెట్టాలని చూసినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు.

## చేబ్రోలు మహేష్‌కు డాక్టరేట్ ప్రదానం



అవార్డును అందుకున్న చేబ్రోలు మహేష్

చిలకలూరిపేట, జూలై 14: పట్టణానికి చెందిన మోడరన్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడె చేబ్రోలు మహేష్‌కు అమెరికాకు చెందిన మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం వారు ఆదివారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కొత్త ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లోని గుల్‌ముహర్ హాల్‌లో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. మోడరన్ విద్యా సంస్థల ద్వారా ఆయన చేసిన విద్యా సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ డాక్టరేట్‌ను అందజేశారు. నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన మహేష్ చిలకలూరిపేటలో స్థిరపడ్డారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థల్లో పలువురు ప్రముఖులు చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. 2015 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన మైలవరపు వెంకట కృష్ణ తేజ మోడరన్ విద్యా సంస్థల్లోనే విద్యాభ్యాసం చేశారు.



సభలో పాల్గొన్న రఘుబాబు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

## అలరించిన కల్చరల్ కార్నివాల్



పోటీలో చిన్నారుల నృత్య ప్రదర్శన

నరసరావుపేట కల్చరల్, జూలై, 14. రంగస్థలి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక భువనచంద్ర టౌన్ హాల్‌లో నిర్వహించిన పల్నాడు కల్చరల్ కార్నివాల్ - 2024 విశేషంగా అలరించింది. కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. కాగా చిన్నారుల నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు పోటీలు జరిగాయి. పోటీలలో జిల్లా నలుమూలల నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలు చూపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమానికి ఎంఏఎం కళాశాలల డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృధ్వీరాజ్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. సభకు రంగస్థలి అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 4 దశాబ్దాలుగా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్న రంగస్థలి కార్యవర్గాన్ని అభినందించారు. రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని రఘుబాబుకు అందజేశారు. తొలుత శ్రీ నృత్య ఆర్ట్స్ అకాడమి, విజయవాడ వారు ప్రదర్శించిన కూచిపూడి బృంద నృత్యం అలరించింది. సభలో గౌరవ అతిథిగా పాల్గొన్న పౌరాణిక నటుడు గుమ్మడి గోపాలకృష్ణ కళారంగంలో రంగస్థలి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కపిలవాయి విజయకుమార్, బీఆర్.సుశీల్‌కుమార్, కిలారు వెంకట్రావు, ఎంఎస్ఆర్కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.